మంచితనాన్ని గుర్తించని
ఆ పెద్దతనానికి చివరికి
దక్కిన గౌరవం!

# పెద్దతనం

ఎస్. రాఘవేంద్రరావు
కథ

వీరభద్రమ్మ మంచంమీద పడుకునుంది. ఆమెకు బి.పి ఓవరయ్యింది. డాక్టర్ వెంకటరత్నం ఆమె చూసి. మెడిసిన్స్ రాసిచ్చి అప్పుడే వెళ్లిపోయాడు. పెద్దకొడుకు, మూడోకొడుకు వాళ్ల పెళ్లాం పిల్లలు మంచం చుట్టూరా గుమిగూడి చూస్తున్నారు. రెండో కొడుకన్నా, కోడలన్నా ఈమెకు పడదు. వాళ్లుకూడా ఈమెను చూడరు!

"కష్టలూ, కార్పణ్యాలు ఎలా వున్నా ఇప్పుడొచ్చి మామూలుగా పలకరించెయ్యొచ్చుగా. పక్క పోర్షన్‌లోనే కదా వుండేది" రెండో కొడుకుమీద పెద్దకోడలు చేసిన కామెంట్ అప్పుడే మెలుకువ వచ్చిన వీరభద్రమ్మకు వినబడింది.

"నష్టజాతకపు వెధవ... కుటుంబాన్ని నాలుగు ముక్కలు చేసిన వెధవ. నా ఉసురు వాడికీ వాడి పెళ్లానికి పట్టి వీధులమ్మట అడుక్కుతింటారు. నేను చూడకపోతానా?–" అంటూ గొణుక్కుంది ఆ నీరసంలో వీరభద్రమ్మ.

పెద్దకోడలు ముసిముసి నవ్వులు నవ్వేసుకుంది.

○ ● ○

పదేళ్ల క్రితం రెండో కొడుకు పెళ్లిలో పెళ్లికూతురు తండ్రి ఏదో సందర్భంలో 'గొడవకు ప్రయత్నించకమ్మా' అన్నాడని ఇప్పటివరకు గొడవపెడుతూ, నరకం చూపిస్తూనే వుంది వీరభద్రమ్మ కోడలుకి. దానికి తోడు రెండో కోడలు ఈశ్వరి తిరిగ సమాధానం చెప్పేది కాకపోవడంతో వీరభద్రమ్మ ఆటలు మూడుపువ్వులూ ఆరు కాయలుగా సాగిపోయాయి. మిగిలిన కోడళ్లు



అత్తగారు తనని ఏమీ అనడంలేదుకదాని అనుకున్నారేమోకాని రెండో కోడలుకి ఎప్పుడూ సపోర్టు వెళ్లేవారుకాదు.

పైగా మిగిలిన కోడళ్లు తనని ఏదైనా అనకపోయినా, ఎవరిమీదో వంకపెట్టి అన్నా, పిల్లల్ని ఏమన్నా అన్నా రేసుగుర్రాల్లా అత్తగారిమీద పడిపోయేవారు.

అందరితోనూ విరోధంగా వుంటే తన

కొడుకుల దగ్గర విలువ వుండదేమో అని వీరభద్రమ్మ. పోరులేని రెండో కోడలునే ఆడిపోసుకుంటూ వుసూరు పెడుతూ, శాపనాకారాలు పెడుతూ, దెప్పి పొడుస్తూ... పోటీగా మాట్లాడేది మీదమీదకు వెళ్తూ.

మిగిలిన కోడళ్లు ఏదైనా తప్పుచేసినా "పాపం నీరసంగా వున్నట్టుంది నీకు... రాత్రంతా పిల్లలతో నిద్ర వుండి వుండదు. నలిగిపోయినా, పగిలిపోయినా ఏం ఫర్వాలేదమ్మా. అసలు నిన్నని ఏం లాభం. గదిలోంచి ఇంత జరిగినా పూడిపడిందా, ఆ రెండో రాక్షసి... దాన్ని తెచ్చుకున్నాము. నాకన్నీ అనర్థాలే. నా కుటుంబం శ్మశానం చేసి పాడేస్తుంది" అంటూ అర్థంకాని గొడవ పెట్టేసేది! ఇష్టమున్నవాళ్లని నెత్తిమీద, ఇష్టం లేనివారిని కాలికింద వీరభద్రమ్మ తత్వం!

కాపురానికి వచ్చిన కొత్తల్లో రెండో కోడలు 'కూరలు సరిగా తరగడంరాదు' అన్నదని "కూరలు తరగడంరాదు. బాగా మెక్కి తినడం వచ్చే" అన్న భయంకరమైన అత్తగారి దెప్పిపొడుపు మాటతో 10 సంవత్సరాలు ఆ ఇంట్లో సరిగా కూరలే తినడం మానేసింది రెండో కోడలు!

"అత్తయ్యా, కొంచెం జ్వరంగా వుంది" అని ఒకసారి అంటే —

"ఏ... నాటకమా... జ్వరమొచ్చిందని నీకెలా తెలుసు? జ్వరమాని నోట్లో పెట్టుకు చూసుకున్నావా?" అంటూ ఎగతాళిచేసింది వీరభద్రమ్మ రెండోకోడలుని.

మిగిలినవాళ్లకి కొంచెం తలనొప్పయితే పెద్ద రోగం వచ్చేసినట్టు వాళ్లని మంచం దిగనివ్వకుండా పైగా కాళ్లుకూడా పడుతూ "ఏ వంకా లేనమ్మ డొంక పట్టుకున్నది" అన్నట్టు రెండో కోడలుకి జ్వరం, విరేచనాలు, వాంతులు రావాలని శాపనాకారాలు పెట్టేది.

రెండో కోడలు ఈశ్వరి భర్త రఘుకి ఎప్పుడన్నా తన గాథ చెప్తే... 'తల్లే దైవం' అన్న గొప్ప నీతిలో మునిగిపోయి వున్న ఆమె భర్త ఆమెకూ, ఇటు తల్లికీ ఏమీ తీర్పు చెప్పలేకపోయేవాడు. ఆ విధంగానూ రెండో కోడలు ఈశ్వరికి ఏమాత్రం ధైర్యం లేకుండా గడిపేయడం... ఏడుపే నిద్రాహారంగా భావించడం నేర్చుకుంది.

10 సంవత్సరాల భయంకర రొంపి జీవితం అనుభవించిన ఈశ్వరి ఇప్పటికీ అత్తగారి ముఖంచూడ్డానికి భయపడుతుంది!

10 సంవత్సరాల తర్వాత భార్యకు మోక్షం కలిగించాలి అన్న నిర్ణయానికి వచ్చిన రఘు అన్నదమ్ముతో "మేం ఏర్పాటుగా వుంటాం" అని చెప్పడం... ఆ అవకాశం ఎవరిద్వారా ఎప్పుడొస్తుందా అని చూసే మిగిలినవాళ్లు...

"ఏం చేయం... మా అందరికీ కలిసి వుండాలనే వుంది... ఇప్పుడు మళ్ళీ నిర్ణయం తీసుకున్నాక కుదుర్తుందా... అలాగే చేసేద్దాం. ఎవరి పోర్షన్‌లో వాళ్లు వండుకుతిందాం" అంటూ తెగ బాధపడిపోయినట్టు నటించి ఇల్లుని మూడు పోర్షన్‌లు చేసేసుకున్నారు.

అదిగో... అప్పుడే రెండో కొడుకుమీద కొత్తగా కసి పెంచేసుకుంది వీరభద్రమ్మ. తను గతంలో కోడలుని ఆడిపోసుకుంటున్నప్పుడు కొడుకు ముందుకొచ్చి పెళ్లాం జుట్టు పట్టుకుని 'మా అమ్మ మాట వింటావా లేదా' అని కొడుకు తిట్టలేదని వీరభద్రమ్మ

ఉద్దేశం. ఎంతోమంది కొడుకుల్లా కిరసనాయిలు పోసి అంటించడం, పురుగులమందు పండులో పెట్టి ఇవ్వడం, పీక నులిమి చంపి ఆత్మహత్యగా చిత్రించడంలాంటివి ఆ రెండో కొడుకు తనకు దన్నుగా వుండి చేయలేదని వీరభద్రమ్మ బాధ.

'అటు తల్లేకాదు, ఇటు నన్నే నమ్ముకొచ్చిన భార్య గొప్పది' అన్న గొప్ప రాజనీతి తెలుసున్నవాడు రెండో కొడుకు రఘు.

అదిగో ఆ రాజనీతి తెలియబట్టే కుటుంబం విడిపోయాక ఈ ఆరు నెలలకాలంలో తల్లి బజారుకు ఎక్కి బండతిట్లు తిట్టినా నోరు మెదపలేకపోయాడు రఘు. ఎన్నో శాపనాకారాలు, ఎన్నో పెడార్థపు మాటలు, మరెన్నో ఈసడింపు మాటలు, ఇంకెన్నో బండ మాటలు... తలుపులమీద పడి, దబదబా బాదుతూ వీరభద్రమ్మ పరమ అసహ్యంగా ప్రవర్తిస్తున్నా 'అమ్మ', 'రుణం' అన్న పదాల అర్థం పరిపూర్తిగా తెలుసున్నవాడు కనుక పెదాలు విప్పలేకపోయేవాడు రఘు. 'అమ్మా' అని పిలుద్దామంటే ఆ అవకాశం ఇచ్చేదేకాదు వీరభద్రమ్మ.

"నా కడుపున పుట్టి నామీద విరోధమా. నువ్విలాటి వాడివవుతావని తెలిసుంటే చిన్నప్పుడే నీ పీక నులిమి చంపి చెత్తతొట్టిలో పడేద్దును"

"నా పాలు తాగావే గుండెలమీద పడి... ఇప్పుడు నా పాలన్నీ కక్కు" లాంటి మనుషులు మాట్లాడని మాటలు సినిమా పద్ధతిలో మాట్లాడినా రెండో కొడుకు నోరు మెదపలేకపోయేవాడు.

"కుటుంబం ముక్కలయిందని, నువ్వు పెళ్లాన్ని తన్ని తగలెయ్యలేదని ఆమెకు కసి... అందుకే ఇలా మిమ్మల్నిద్దరినీ బాధలు పెడుతుంది" అనేవారు ఇరుగుపొరుగు.

"అవును మరి... ఆ పరిస్థితిలో కుటుంబం ముక్కలు చేయకపోతే నాదో, నా భార్యదో శవం బైటకెళ్లుండేది. అది మంచిదా, ఇది మంచిదా?" అనేవాడు రఘు.

ఆ ఇరుగుపొరుగే రెండో కొడుకు


## స్కూటర్

"అల్లుడికి మీరే స్కూటర్ కూడా కొనివ్వాలండీ"

"అదేమిటీ మీ అబ్బాయికి స్కూటర్ నడపడం చేతకాదు కదండీ"

"మావాడికి రాకపోతేనేం. నేను భేషుగ్గా నడుపుతా"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



రఘుని 'నీ బాధ చూడలేకపోతున్నామోయ్. .. నువ్వు మీ అమ్మమీద కేసు పెడితే మేం సపోర్టు వుంటాం' అన్నా ముందుకొచ్చేవాడుకాదు.

'అమ్మ', 'రుణం' అవే అతని గుండెలో నాటుకుపోయాయి.

తల్లి రుణం తీర్చుకోవడం గురించి ఎవరైనా అడిగితే "కొన్ని కోట్ల తిట్లు తిట్టినా, పదేళ్లు మానసికంగా నన్ను, నా భార్యను, పిల్లలమా క్రుంగదీసినా, మా గురించి వ్యతిరేకత బంధువర్గంలోను, చుట్టుపక్కల మారిపోసినా 'ఒక్కమాట' ఇప్పటివరకు తిరిగి ఆమెను అనకపోవడమే నేను రుణం తీర్చుకున్నట్టు. ఏ సమస్యా లేని కొడుకే ఈ రోజుల్లో తల్లిని చూడడంలేదు. నాలాంటి సమస్య వున్న ఏ కొడుకైనా తల్లికింత గౌరవం ఇస్తున్నాడేమో చూపించండి. అదే ఆవిడ మమ్మల్ని లోకువ చేయడానికి మూలకారణం అయి వుండవచ్చు. ఆమె తప్పు తెలుసుకోకపోతుందా" అనేవాడు బాధగా.

"పాపం... ఈ రెండో కొడుకు చాలా చులకనైపోయాడు. ఇంకా ఇద్దరు కొడుకులున్నారన్న ధైర్యంతో ఆ పెద్దావిడ వీళ్లని ఇలా ఏడిపిస్తుంది. అదే ఒక్క కొడుకే వుంటే ఇన్ని బాధలు పెట్టి వుండేవాడా? ఇన్ని వినరాని మాటలు అని వుండేదా? ఇతని మంచితనమే ఇతనిని కాపాడాలి. మనం ఎంతమందిని చూడడంలేదు... చిట్టచివరి రోజులలో ఈ పనికిరాని కొడుకు, కోడలే ఆ వీరభద్రమ్మను చూస్తారు" అనుకుంటూ వెళ్లిపోయేవారు ఇరుగుపొరుగువారు.

రఘు అన్నీ తన మంచికే అని నవ్వి ఊరుకునేవాడు.

○ ● ○

వీరభద్రమ్మ బి.పితో మంచంపట్టి రోజురోజుకు క్షీణిస్తూ పూర్తి అస్వస్థతలోకి మారిపోయింది. నా అనుకున్న కొడుకులు చాలాసార్లు హాస్పిటల్‌లో వైద్యం చేయించడం, మళ్లీ ఇంటికి తీసుకురావడం చేస్తూనే వున్నారు పాపం. మంచినీళ్లలా డబ్బు ఖర్చు పెడుతూనే వున్నారు. కాని ఆమెకు వ్యాధి ఎక్కువవుతూనే వుంది. శుష్కించి కాలకృత్యాలు మంచంమీదే అన్న స్థితికి వచ్చేసింది. ఆమెకు కేటాయించిన గది దుర్గంధభరితమైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితుల్లో ఆమె గదిలోకి ఎవ్వరూరావడానికి సాహసించలేకపోతున్నారు.

"ఏమ్రా, చివరి రోజుల్లోకి వచ్చేశాను. నన్ను మీరెవరూ చూడడంలేదు. మిమ్మల్ని నేను నెత్తిన పెట్టుకున్నాను కద్రా. నా కంపును భరాయించలేకపోతున్నారా? మూడు రోజుల్నుంచి మందుబిళ్ల అందించేవారు లేరు. మంచినీళ్లు ఇచ్చేవారు లేరు. చూపు కూడా సరిగా కనిపించడంలేదు. శరీరంమీద ఛీఛీ... పురుగులు పాకుతున్నట్టున్నాయి. ఎవరో ఒకరు రండ్రా" గొణుక్కుంటుంది అదేపనిగా వీరభద్రమ్మ.

ఆ మర్నాడునుండి ఆమెను రోజూ శుభ్రం చేస్తున్నారు. రోజూకాదు గంటగంటకు శుభ్రం చేయవలసి వస్తుంది. డాక్టర్ని మార్పించారు. హాస్పిటల్‌లో కొన్నిరోజులుంచి రోజుకు రెండుసార్లు డ్రెస్సింగ్ చేసేవారు

స్పెషలిస్టులుకూడా చూశారు. కొంచెం కొంచెం ఆరోగ్యంలో మార్పు వస్తుంది. మాట్లాడగలుగుతుంది స్పష్టంగా. చూపు కూడా కొంచెంకొంచెంగా కనిపిస్తుంది. ఎవ

రి ఆధారం లేకుండా లేచి కూర్చోగలుగుతుంది.

ఆరోజు... ఆమె మొదటగా అస్వస్థతనుండి కళ్లు తెరచినరోజు...

గదంతా సుగంధభరితంగా వుంది. ఇదివరలా తన వంటిమీద చిరిగి కంపుకొట్టే అసహ్యపు బట్టల్లేవు. పురుగులుపట్టే స్థితిలోకి వచ్చిన ఆమె శరీరంలో మార్పు కనిపించింది. గదిలో ఎక్కడా పురుగుల్లేవు. కానీ... ఎదురుగా తను పురుగుల్లా చూసిన రఘు, ఈశ్వరి ఓ మూల నిలబడి వున్నారు.

మీరెందుకొచ్చారు. ప్రాణాలతో బతికున్నానో, చచ్చానో చూద్దామనా, నన్ను చూసి వేళాకోళం చేసి దెప్పిపొడుద్దామని'' ఆవేశంగా అంది వీరభద్రమ్మ.

పొరుగింటావిడ వచిన ఈ పదిరోజుల్లో జరిగిన విషయమంతా చెప్పింది.

''ఏమిటే నిజమా... నన్ను వాళ్లంతా 10 రోజుల్నుండి పూర్తిగా వదిలేశారా. మీరిద్దరే నాకు సేవలు చేశారా. నాకు ప్రాణం పోశారా. ఈ కంపుగదిలోకి... ఈ కంపు మనసుదాని దగ్గరకు రావాలని మీకెలా అనిపించింది. చెడ్డగా కనబడేవాళ్లలో మంచివాళ్లు, మంచిగా కనబడేవాళ్లలో చెడ్డవాళ్లు వుంటారని తెలిసినా మిమ్మల్ని సమదృష్టితో చూడలేకపోయాన్రా.

వయసులో పెద్దదాన్నయినా మనసులో చిన్నదాన్నయిపోయాను. మీరు... వయసులో చిన్నవాళ్లయినా మానసికంగా పెద్దవాళ్లయిపోయారు. నా పెద్దతనాన్ని నిలుపుకోలేకపోయాను. పాపిష్టిదాన్ని.

నా కంపును పులుముకుని, మీరు నన్ను బతికించి మళ్లీ నాకు తీరని ద్రోహం చేశారు. అవును... చచ్చిపోతే ఏ గొడవా లేకుండా పోయును. ఇప్పుడు నా ముఖం మీకిద్దరికీ చూపించలేకపోతున్నాన్రా. అలాగని నన్ను వదిలేసేరే... వాళ్లు... వాళ్లదగ్గరా ఇప్పుడు వుండలేను. మరి... మీ దగ్గరా వుండి మీకు నా ముఖమూ చూపించలేను. అందుకనే నన్నే ఆశ్రమంలోనైనా దిగబెట్టరా... చిన్నోడా. ఆ పుణ్యం కట్టుకో కోపమా.... కోడలుపిల్లా నువ్వయినా వాడికి చెప్పమ్మా. నిన్ను తిట్టాను. పెళ్లయిన తరువాత ప్రతిరోజూ తిడుతూనే వున్నాను. నన్ను 'అత్తయ్యా' అని పిలుద్దామని నువ్వనుకునేసరికి మళ్లీ తిట్టేదాన్ని. ఇక నువ్వెలా నన్ను అత్తయ్యా అని పిలుస్తావు. ఇదిగో... మీరిద్దరూ నాకేదో నచ్చచెప్పడానికి ప్రయత్నిద్దామనుకుంటున్నారా? ఈ విషయంలో ఆ దేవుడు వచ్చి చెప్పినా వినను'' వీరభద్రమ్మ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ చెప్పింది.

ఆమె నిర్ణయంలో మార్పు రాదని గ్రహించి ఇంట్లో అందరితో సంప్రదించి ఆమెను ఆశ్రమంలో దిగవిడిచి రాడానికి అన్ని ఏర్పాట్లూ మాట్లాడి టాక్సీ తెచ్చాడు రఘు. అందులో ఆమెను కూర్చోబెట్టాడు డ్రైవర్ సహాయంతో. అతని భార్యాపిల్లలు దగ్గరే వున్నారు. మిగిలిన పెద్దాపిల్లా అంతా కిటికీల్లోంచి చూస్తున్నారు.

టాక్సీ నెమ్మదిగా కదలబోతోంది. వీరభద్రమ్మ అశువులు గాల్లో వేగంగా కలిసిపోయాయి. తన ఒడిలో వాలిన తల్లిని చూసి చిన్నకొడుకు 'అమ్మా' అన్న పెద్దకేకతో అందరూ కిటికీలు వదిలి తలుపులు గడియలు తీసుకుని బైటకొచ్చారు.

ఆ ముసలావిడ మీద పడ్డారు... చివరి కార్యక్రమాలు నిర్వర్తించడంకోసం. ★